బానోత్ బాలు

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

- వ్యవసాయ బావి తీయడానికి 5 లక్షల అప్పు
- 3 ఎకరాల్లో బిగుబడి రాక నష్టం
- భూమి అమ్మినా తీరని అప్పులు
- మనస్తాపంతో గడ్డిమందు తాగి బలవన్మరణం

నెల్లికుదురు, జూన్ 29 : అప్పుల బాధ మరో రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలంలో చోటు చేసుకున్నది. ఎస్సై క్రాంతికిరణ్ కథనం ప్రకారం.. హేమ్లాతండా శివారు బోడ్యాతండాకు చెందిన బానోత్ బాలు (50) తనకున్న మూడు ఎకరాల భూమిలో వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. పంట సాగుతోపాటు వ్యవసాయ బావి తవ్వించడానికి తండావాసుల వద్ద రూ.5 లక్షల వరకు అప్పు చేశాడు. అప్పు ఇచ్చిన వాళ్లు డబ్బులు తిరిగి ఇవ్వాలని అడుగుతుండటంతో తనకున్న 3 ఎకరాల భూమి నుంచి 25 గుంటలను విక్రయించాడు. అయినా, అప్పు తీరకపోవడం, పంట దిగుబడి కూడా రాకపోవడంతో కొంత కాలంగా మనోవేదన చెందుతున్నాడు. శుక్రవారం వ్యవసాయ బావి వద్దకు వెళ్లి గడ్డిమందు తాగి, విషయాన్ని తన పెద్ద కొడుకు బానోత్ నవీన్‌కు ఫోన్‌లో సమాచారం ఇచ్చాడు. ఆ సమయంలో హైదరాబాద్‌లో ఉన్న నవీన్ వెంటనే తన తమ్ముడు ప్రవీణ్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాడు. అతడు వచ్చి మహబూబాబాద్ ఏరియా వైద్యశాలకు తరలించగా.. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శనివారం సాయంత్రం మృతి చెందాడు. కొడుకు నవీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

డీఎస్ పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

డీఎస్ భౌతికకాయంపై కాంగ్రెస్ జెండా కప్పుతున్న డిప్యూటీసీఎం భట్టి, మంత్రి శ్రీధర్‌బాబు

మాజీమంత్రి డీఎస్ కన్నుమూత

- ఇంట్లోనే గుండెపోటుతో మృతి
- పీసీసీ అధ్యక్షుడిగా, మంత్రిగా సేవలు
- మోదీ, రేవంత్, కేసీఆర్ సంతాపం
- అధికారిక లాంఛనాలతో నేడు నిజామాబాద్‌లో అంత్యక్రియలు

హైదరాబాద్, జూన్ 29 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి ధర్మపురి శ్రీనివాస్ (75) కన్నుమూశారు. కొద్దికాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన శనివారం ఉదయం గుండెపోటుతో జూబ్లీహిల్స్‌లోని స్వగృహంలో తుదిశ్వాస విడిచారు.డీఎస్ భౌతికకాయానికి మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, ఇంద్రకరణ్‌రెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎంపీలు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మల్లురవి, కాంగ్రెస్ సీనియర్ నేతలు షబ్బీర్ అలీ, వీ హన్మంతరావు, మధుయాష్కీగౌడ్, అంజన్‌కుమార్ యాదవ్, జీ నిరంజన్ నివాళులర్పించారు.

ఆదరించిన కేసీఆర్..

దశాబ్దాలుగా పార్టీ కోసం పని చేసిన డీఎస్‌ను కాంగ్రెస్ నిర్లక్ష్యం చేసింది. ఆయనకు ఏ పదవీ ఇవ్వకుండా దూరం పెట్టింది. ఈ క్రమంలోనే అప్పటి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేరదీశారు. బీఆర్ఎస్‌లో ఆయనకు తగిన గౌరవం ఇచ్చారు. 2016లో రాజ్యసభ సభ్యుడ్ని చేశారు. ఆ తర్వాత కొన్ని కారణాలతో బీఆర్ఎస్‌కు డీఎస్ దూరమయ్యారు. రాజ్యసభ సభ్యుడిగా ఉన్న సమయంలోనే ఆయన కొడుకుల్లో ఒకరు కాంగ్రెస్‌లో, మరొకరు బీజేపీలో కొనసాగడం విశేషం. 2022లో ఎంపీ పదవి ముగిసిన తర్వాత కాంగ్రెస్ గూటికి చేరిన డీఎస్, వయోభారంతో ఇంటికే పరిమితమయ్యారు.

ప్రముఖుల సంతాపం

డీఎస్ మృతిపై ప్రధాని మోదీ ట్విట్టర్‌లో సంతాపం తెలిపారు. ఆయన మరణం తనను ఎంతో బాధించిందని పేర్కొన్నారు.కాంగ్రెస్‌కు ఆయన చేసిన సేవలు మర్చిపోలేనివని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. డీ శ్రీనివాస్ మరణంపై బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ సంతాపం ప్రకటించారు. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఏపీ సీఎం చంద్రబాబు,డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఏపీ మాజీ సీఎం జగన్, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రాజనర్సింహ, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, కేంద్ర మంత్రి బండి సంజయ్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎంపీ నామా నాగేశ్వర్‌రావు, మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య, సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ తదితరులు తమ సంతాపాన్ని వ్యక్తపరిచారు.

అజాత శత్రువు డీఎస్ : కేటీఆర్, హరీశ్

డీఎస్ భౌతికకాయానికి కేటీఆర్, హరీశ్ నివాళులర్పించి మాట్లాడారు. రాజకీయాల్లో అజాతశత్రువు డీ శ్రీనివాస్ అని,డీఎస్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నామని పేర్కొన్నారు. డీఎస్ మరణం రాష్ట్రానికి తీరని లోటు అని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు.

నేడు అంత్యక్రియలు

డీ శ్రీనివాస్ అంత్యక్రియలను ఆదివారం అధికారిక లాంఛనాలతో నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు అధికారులకు సీఎస్ శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. హైదరాబాద్ నుంచి డీఎస్ భౌతికకాయాన్ని శనివారం సాయంత్రం ఆయన స్వస్థలం నిజామాబాద్‌కు తరలించారు.

నాలుగు దశాబ్దాల రాజకీయ ప్రస్థానం..

నిజామాబాద్, జూన్ 29 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : నిజామాబాద్ జిల్లా వేల్పూర్‌లోని సాధారణ వ్యవసాయ కుటుంబంలో 1948, సెప్టెంబర్ 27న జన్మించిన ధర్మపురి శ్రీనివాస్ ఉన్నత విద్యను అభ్యసించారు. రాజకీయాలకు ఆకర్షితులై కాంగ్రెస్‌లో కార్యకర్తగా చేరారు. 1989లో తొలిసారిగా నిజామాబాద్ ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 1994లో ఓడిపోయినా 1999, 2004లో వరుసగా గెలిచారు. 2004లో పీసీసీ అధ్యక్షుడిగా సేవలందించి, వైఎస్ క్యాబినెట్‌లో గ్రామీణాభివృద్ధి, ఉన్నత విద్యాశాఖ మంత్రిగా పని చేశారు. 2009లోనూ డీఎస్‌కు పార్టీ అధిష్ఠానం పీసీసీ పీఠాన్ని కట్టబెట్టింది. 2012లో జరిగిన ఉప ఎన్నికల్లో ఓటమి పాలై ప్రత్యక్ష రాజకీయాలకు దూరమైన ఆయన, స్వరాష్ట్రంలో 2014 జూన్ 3 నుంచి 2015, జూలై 2 దాకా శాసనమండలిలో తొలి ప్రతిపక్ష నాయకుడిగా వ్యవహరించారు.

మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ కన్నుమూత

జడ్పీ చైర్మన్, ఎమ్మెల్యే, ఎంపీగా సేవలు

ఆదిలాబాద్, జూన్ 29 (నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ మాజీ ఎంపీ, బీజేపీ నాయకుడు రాథోడ్ రమేశ్ (57) శనివారం కన్నుమూశారు. ఉదయం అస్వస్థతకు గురైన ఆయన్ను కుటుంబ సభ్యులు వైద్యం కోసం ఆదిలాబాద్ ప్రైవేటు దవాఖానకు తీసుకెళ్లారు. ఆయన కోమాలోకి చేరుకోవడంతోపాటు ఆరోగ్యం క్షీణించడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలిస్తుండగా గుండెపోటుతో మార్గమధ్యంలో ఇచ్చోడ వద్ద మృతిచెందారు. ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలం తాడిహత్నూర్‌కు చెందిన రాథోడ్ రమేశ్ వ్యవసాయ కుటుంబానికి చెందిన వారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పార్టీ నుంచి రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన ఆయన సుదీర్ఘంగా 35 ఏండ్లు రాజకీయాల్లో ఉన్నారు. 1989లో నార్నూర్ జడ్పీటీసీగా గెలిచారు. 1999లో టీడీపీ నుంచి ఖానాపూర్ ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 2004 అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయారు. 2006లో ఆసిఫాబాద్ నుంచి జడ్పీటీసీగా గెలిచిన రాథోడ్ రమేశ్ ఉమ్మడి ఆదిలాబాద్ జడ్పీ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. 2009లో టీడీపీ నుంచి ఆదిలాబాద్ ఎంపీగా పోటీ చేసి విజయం సాధించారు. ఎమ్మెల్యే, జడ్పీ చైర్మన్, ఎంపీగా ఆయన ప్రజలకు విశేష సేవలు అందించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. ఆదివారం ఉట్నూర్ ఎక్స్‌రోడ్‌లోని ఆయన వ్యవసాయ క్షేత్రంలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

వీసీ పోస్టుల్లో బీసీలను నియమించాలి

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్ కృష్ణయ్య డిమాండ్

రవీంద్రభారతి, జూన్ 29: యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ నియామకాల్లో బీసీలకు 50 శాతం పోస్టులు ఇవ్వాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ కృష్ణ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ.. యూనివర్సిటీలలో 2400 ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్పొరేషన్ ప్రభుత్వరంగ, ఇతర సంస్థల చైర్మన్, డైరెక్టర్ పోస్టులలో బీసీలకు 50 శాతం కోటా ఇవ్వాలని కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల వాగ్దానంలో పేర్కొన్నట్టు బీసీ కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేయాలని కోరారు. 100 గురుకుల పాఠశాలలు, 50 ఇంజినీరింగ్ కాలేజీలు, రెండు యూనివర్సిటీలు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. బీసీ విద్యార్థులకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ నేత నీల వెంకటేశ్, సి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల పంటలకూ డ్రిప్

- ఈ ఏడాది మొత్తం 1.70 లక్షల ఎకరాలు టార్గెట్
- ఆయిల్‌పామ్‌తో పాటు ఉద్యాన పంటలకు ఇవ్వాలని నిర్ణయం

హైదరాబాద్, జూన్ 29(నమస్తే తెలంగాణ): బిందుసేద్యం కింద డ్రిప్, స్ప్రింక్లర్లను ఇకపై ఆయిల్‌పామ్‌తో పాటు కూరగాయలు, పండ్లతోటలకు కూడా అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. 2024-25 సంవత్సరానికి ఉద్యానశాఖ ప్రణాళికను సిద్ధం చేసింది. ఈ ఏడాది మొత్తం రూ. 509 కోట్ల ఖర్చుతో 1.70 లక్షల ఎకరాలకు డ్రిప్, స్ప్రింక్లర్లను అందించేలా ప్రణాళికను రూపొందించింది. ఇందులో లక్ష ఎకరాల్లో ఆయిల్‌పామ్ కోసం డ్రిప్‌ను అందించనుండగా 70,625 ఎకరాల్లో కూరగాయలు, పండ్లు, ఇతర వ్యవసాయ పంటలకు కూడా డ్రిప్, స్ప్రింక్లర్ ఏది అవసరమైతే అది అందించనుంది. తొలిదశలో 85,313 ఎకరాలకు బిందుసేద్యం పరికరాలు అందించాలని నిర్ణయించింది. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న రైతులకు ముందుగా అందించాలని నిర్ణయించింది.

వనమహోత్సవం ప్రారంభోత్సవంలో భాగంగా కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్‌లో పొగడ మొక్క నాటి నీళ్లు పోస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు తదితరులు

హెరిటేజ్ సిటీగా వరంగల్

- స్మార్ట్ సిటీ మిషన్‌లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ
- బైపాస్, ఇన్నర్ రింగురోడ్డు భూసేకరణకు నిధులు
- హాస్పిటల్ భవన నిర్మాణ ఖర్చుపై ఫోరెన్సిక్ ఆడిట్
- గడువులోపు పూర్తికి నిర్మాణ సంస్థకు ఆదేశం
- వరంగల్ పర్యటనలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

వరంగల్, జూన్29 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : హెల్త్, ఎకో టూరిజం సిటీగా వరంగల్‌ను అభివృద్ధి చేయనున్నట్టు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి తెలిపారు. వరంగల్, హనుమకొండ జిల్లాల్లో శనివారం సీఎం పర్యటించారు. ఈ సందర్భంగా కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు, మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. హనుమకొండ సమీకృత కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ మహిళా శక్తి క్యాంటీన్‌ను పరిశీలించారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అభివృద్ధి పనులపై మంత్రులు, వరంగల్ ఉమ్మడి జిల్లా ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. వరంగల్ సమగ్ర అభివృద్ధికి మాస్టర్ ప్లాన్(2050)ను రూపొందించాలని అధికారులకు సూచించారు. మామునూరు ఎయిర్‌పోర్టుకు, ఇన్నర్, ఔటర్ రింగ్ రోడ్డుకు నిర్మాణాలకు భూసేకరణ పూర్తి చేయాలని సూచించారు. స్మార్ట్ సిటీ మిషన్‌లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీకి డీపీఆర్‌ను సిద్ధం చేయాలని ఆదేశించారు.మెగాటెక్స్‌టైల్ పార్కులో భూములు కోల్పోయిన రైతులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. వరంగల్ అభివృద్ధిపై 20 రోజులకు ఒకసారి ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, 45 రోజుల్లో మరోసారి తాను సమీక్ష నిర్వహిస్తానని సీఎం చెప్పారు. అనంతరం స్వశక్తి మహిళలకు రూ.518 కోట్ల71లక్షల 20వేల చెక్కును ముఖ్యమంత్రి అందజేశారు.

నిర్మాణ వ్యయంపై ఆగ్రహం

వరంగల్ సూపర్ స్పెషాలిటీ దవాఖాన నిర్మాణ అంచనా వ్యయం రూ.1100 కోట్లు నుంచి రూ.1726 కోట్లకు ఎందుకు పెరిగిందని అధికారులను సీఎం రేవంత్ ప్రశ్నించారు. ఈపీసీ పద్ధతిన పనులు చేపడుతున్నందున అలా పెంచే వీలులేదని, దీనికి ఎవరు బాధ్యత వహిస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హాస్పిటల్ భవన నిర్మాణ ఖర్చుపై ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. నిర్దేశిత గడువులోగా యుద్ధప్రాతిపదికన హాస్పిటల్ నిర్మాణం పూర్తి చేయాల్సిందేనని నిర్మాణ సంస్థకు తేల్చి చెప్పారు.

మెగా పార్కులో వనమహోత్సవం

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం వనమహోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్‌లో పొగడ మొక్క నాటి రాష్ట్రస్థాయిలో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మంత్రులు సురేఖ, సీతక్క,రాజనర్సింహా, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ విప్ రాంచంద్రూనాయక్, ఎంపీలు కావ్య, బలరాంనాయక్, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి,ప్రకాశ్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణ, యశస్విరెడ్డి, మురళీనాయక్, ఎమ్మెల్సీలు సారయ్య, మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, మేయర్ గుండు సుధారాణి, టెస్కాబ్ చైర్మన్ ఎం రవీందర్‌రావు, సీఎస్ శాంతికుమారి, డీజీపీ రవి గుప్తా, పీసీసీఎఫ్ రాకేశ్‌మోహన్ డోబ్రియల్, కలెక్టర్లు పాల్గొన్నారు.

వినతులు స్వీకరించలేదు

హనుమకొండ జిల్లా సమీకృత కలెక్టరేట్‌కు సీఎం వచ్చారని తెలుసుకుని ప్రజలు వినతి పత్రాలు ఇచ్చేందుకు ప్రయత్నించారు. కానీ సమీక్ష నుంచి బయటికి వచ్చిన సీఎం, మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు వెంటనే ప్రభుత్వ బస్సులోకి ఎక్కారు. తమ వినతిపత్రాలను ఎవరూ తీసుకోకపోవడంతో కొందరు వాటిని బస్సుపై విసిరేశారు. సీఎంను కలిసేందుకు వచ్చిన 108 సిబ్బందిని కలెక్టరేట్ ఆవరణలోకి అనుమతించలేదు.

నిర్బంధాలు.. నిరసనలు

హనుమకొండ/సుబేదారి/దామెర/వరంగల్: సీఎం పర్యటన నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేశ్‌రెడ్డిని, కార్యకర్తలను హనుమకొండలో పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. హౌస్ అరెస్టయిన వారిలో రాకేశ్‌రెడ్డితో పాటు 2వ డివిజన్ కార్పొరేటర్ రవి నాయక్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఉన్నారు. బీఆర్ఎస్ నాయకులను అరెస్ట్ చేసిన పోలీసులు ఎనిమిది మందిని సుబేదారి, ఇద్దరిని హనుమకొండ, ఐదుగురిని కేయూ పోలీస్‌స్టేషన్లకు తరలించారు. సీఎం పర్యటనను అడ్డుకుంటామన్న కేయూ విద్యార్థులను కేయూ పోలీసులు అరెస్ట్ చేశారు. నేషనల్ గ్రీన్ ఫీల్డ్ హైవేలో భూములు కోల్పోతున్న భూ నిర్వాసితులను అరెస్టు చేయడంతో పోలీస్‌స్టేషన్‌లోనే వారు నిరసన తెలిపారు. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి సందర్శన సమయంలో ఎదురుగా ఉన్న సెంట్రల్ లైబ్రరీలో గ్రూప్స్‌కు సన్నద్ధమవుతున్న నిరుద్యోగులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. నిరుద్యోగులు రోడ్డుపైకి రాకుండా పోలీసులు లైబ్రరీ గేట్‌కు తాళం వేశారు.

ఎమ్మెల్యే దొంతి దూరం..దూరం

సీఎం పర్యటనకు సొంత పార్టీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి దూరంగా ఉన్నారు. నర్సంపేట నియోజకవర్గం నుంచి రెండోసారి గెలిచిన దొంతి మాధవ రెడ్డి సీఎం సమీక్ష సమావేశానికీ హాజరు కాలేదు. పార్టీ కోసం పని చేసిన వారికి కాదని, కొత్తగా వచ్చిన వారికి మంత్రి పదవులు ఇచ్చారని మాధవరెడ్డి అసంతృప్తితో ఉన్నారు. రేవంత్‌రెడ్డి పీసీసీ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టి నుంచి దొంతి మాధవరెడ్డి దూరంగానే ఉంటున్నారు. సీఎంగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు రేవంత్‌రెడ్డిని ఒక్కసారి కూడా దొంతి మాధవరెడ్డి కలవలేదని తెలిసింది.

వికారాబాద్ జిల్లా నవాబుపేటలో కాలెయాదయ్య చేరికను నిరసిస్తూ అమరణ దీక్షకు కూర్చున్న కాంగ్రెస్ నేతలను తీసుకెళ్తున్న పోలీసులు

యాదయ్య చేరికపై కాంగ్రెస్ నేతల నిరసన దీక్ష

నవాబుపేట, జూన్ 29: చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యను బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి చేర్చుకోవడంపై కాంగ్రెస్ నేతలు భగ్గుమంటున్నారు. ఈ విషయంపై సీఎం రేవంత్‌రెడ్డి పునరాలోచించుకోవాలని డిమాండ్ చేస్తూ వికారాబాద్ జిల్లా నవాబుపేట మండల కాంగ్రెస్ నాయకుడు కొండల్ అనుచరులతో కలిసి తహసీల్ కార్యాలయం పక్కనే ఆమరణ దీక్ష ప్రారంభించారు. పోలీసులు అక్కడి వచ్చి కాంగ్రెస్ నేతలను తరలించారు.

కొండగట్టులో ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

కొండగట్టులో పూజలు చేస్తున్న ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

మల్యాల, జూన్ 29: జగిత్యాల జిల్లా కొండగట్టు అంజన్నను ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ శనివారం దర్శించుకున్నారు. పవన్‌కు ఆలయ ఈవో ఆకునూరి చంద్రశేఖర్, ఆలయ స్థానాచార్యుడు కపీంద్రస్వామి నేతృత్వంలో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ ప్రాకార మండపంలో అధికారులు శేషవస్త్రంతో సత్కరించి స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. టీటీడీ నుంచి నిధులు కేటాయించి 100 గదుల ధర్మశాలను నిర్మించాలని, ఒకేసారి 2వేల మందితో దీక్షవిరమణ చేసేలా మండపం నిర్మించేందుకు చొరవ చూపాలని పవన్‌కల్యాణ్‌కు ఈవో వినతిపత్రాన్ని అందజేశారు. కొండగట్టుకు అధిక సంఖ్యలో అభిమానులు చేరుకోగా, రూఫ్‌టాప్‌పై నుంచే పవన్ అభివాదం చేశారు. కార్యక్రమంలో కలెక్టర్ సత్యనారాయణ, ఆర్డీవో మధుసూదన్, ఎస్పీ అశోక్‌కుమార్, డీఎస్పీ రఘుచందర్, ఆనంద్‌సాయి, ఆలయ ఏఈవో వైరాగ్యం అంజయ్య, పర్యవేక్షకులు చంద్రశేఖర్, శ్రీనివాసశర్మ, తహసీల్దార్ ఉన్నారు.

ఇంకా 2.3 లక్షల పెండింగ్ దరఖాస్తులా?

- రెండు వారాల్లో పరిష్కరించినవి 21 వేలేనా?
- కలెక్టర్లపై సీసీఎల్ఏ నవీన్ మిట్టల్ ఆగ్రహం

హైదరాబాద్, జూన్ 29 (నమస్తే తెలంగాణ): ధరణిలో పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం నత్తనడకన సాగడంపై సీసీఎల్ఏ నవీన్ మిట్టల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఆయన కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా ధరణిలో 2.3 లక్షలకుపైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్టు వెల్లడించారు. జూన్ 14న వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, వారం రోజుల్లో పరిష్కరించాలని ఆదేశించామని గుర్తుచేశారు. రెండు వారాలు గడిచినా 21 వేల దరఖాస్తులే పరిష్కారమయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టర్ల స్థాయిలో 12 వేలు, అదనపు కలెక్టర్ల స్థాయిలో 20 వేలు,ఆర్డీవోల స్థాయిలో 53 వేలు, తాసీల్దార్ల స్థాయిలో 1.4 లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా ఆర్డీవోలు, తాసీల్దార్లతో నవీన్ మిట్టల్ నేరుగా మాట్లాడి.. ఎందుకు ఆలస్యం అవుతున్నదో ఆరా తీశారు. ధరణి సమస్యల పరిష్కారంపై సీఎం రేవంత్‌రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రత్యేకంగా దృష్టి సారించారని తెలిపారు. త్వరలో మరోసారి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తానని, ఆలోగా పెండింగ్ దరఖాస్తులన్నీ పరిష్కరించాలని నవీన్ మిట్టల్ స్పష్టం చేసినట్టు రెవెన్యూ వర్గాలు తెలిపాయి. ఈ కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలు, తాసీల్దార్లు కూడా పాల్గొన్నారు.

విద్యావైద్యంతోనే విశ్వనగర ఖ్యాతి

- ఇప్పటికే ఆ ఘనత సాధించిన హైదరాబాద్ : సీఎం రేవంత్‌రెడ్డి
- హనుమకొండలో మెడికవర్ హాస్పిటల్ ప్రారంభం

హనుమకొండలో మెడికవర్ హాస్పిటల్‌ను ప్రారంభిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

న్యూశాయంపేట, జూన్ 29 : విద్య, వైద్యం, విద్యుత్తు అందుబాటులో ఉంటే విశ్వనగరంగా అభివృద్ధి సాధ్యమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఇప్పటికే హైదరాబాద్ ఆ మేరకు అభివృద్ధి చెందిందని తెలిపారు. హనుమకొండ హంటర్‌రోడ్‌లో మెడికవర్ హాస్పిటల్‌ను శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంత్రులు దామోదర రాజనర్సింహ, సురేఖ, సీతక్క, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎంపీలు, ఎమ్మెల్యేలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైద్య రంగాన్ని విస్తరించాలన్న ప్రభుత్వ ఆలోచనకు అనుగుణంగా ఇక్కడ మెడికవర్ హాస్పిటల్‌ను ప్రారంభించుకోవడం సంతోషంగా ఉన్నదని అన్నారు. ఫార్మా విషయమై ఎప్పుడు చర్చకు వచ్చినా అందులో హైదరాబాద్‌కు స్థానం ఉంటుందని తెలిపారు. తెలంగాణను మెడికల్ టూరిజం హబ్‌గా తీర్చిదిద్దుతామని చెప్పారు. రాష్ట్రం లో ప్రతి పౌరుడికి డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ కార్డు ఇవ్వాలని ప్రభుత్వం ఆలోచన చేస్తున్నదని పేర్కొన్నారు. మెడికవర్ హాస్పిటల్స్ ఇండియా చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జీ అనిల్ కృష్ణ మాట్లాడుతూ దేశంలో అగ్రగామి మల్టీనేషనల్ హాస్పిటల్ చైన్‌గా ప్రస్తుతం 24 దవాఖానలను నిర్వహిస్తూ, ఏటా లక్షలాది మందికి వైద్య సేవలను అందిస్తున్నట్టు తెలిపారు. అత్యంత నిష్ణాతులైన 40 మందికి పైగా డాక్టర్లతోపాటు ప్రపంచస్థాయి క్యాత్ ల్యాబ్ ఇక్కడ అందుబాటులో ఉంటుందని చెప్పారు. మెడికవర్ హాస్పిటల్స్ ఇండి యా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు డాక్టర్ ఏ శరత్‌రెడ్డి, పీ హరికృష్ణ మాట్లాడుతూ వరంగల్‌లో 300 పడకలతో ఏర్పాటు చేసిన ఈ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో ఏడు ఆపరేషన్ థియేటర్స్ తోపాటు పెద్ద సంఖ్యలో ఐసీయూ బెడ్స్ ఉన్నాయని తెలిపారు.

ఎన్‌హెచ్ నిర్మాణంలో అక్రమాలపై ఏసీబీ విచారణ

- నలుగురిని అదుపులోకి తీసుకున్న అధికారులు

కుమ్రం భీం ఆసిఫాబాద్, 29 (నమస్తే తెలంగాణ): కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో జాతీయ రహదారి నిర్మాణంలో జరిగిన అక్రమాలపై శనివారం ఏసీబీ అధికారులు నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వరంగల్‌లో ఆర్డీవో దత్